# కృతజ్ఞత

(ఉగాది కథానికల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథానిక)

పర్యావరణం మీద సత్తిబాబు గీసిన చిత్రం జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు ఢిల్లీ నుంచి మెసేజ్ వచ్చింది.

"కంగ్రాట్స్" ప్రధాన సంపాదకునితోపాటు స్టాఫంతా సత్తిబాబును అభినం దించారు.

"బహుమతి అందుకోవడానికి ఎప్పుడు వెళుతున్నావ్"? ఉండబట్టక అడిగాడు అతడితో సన్నిహితంగా మెలిగే మల్లేషు.

"నేనక్కడికి వెళ్ళకపోయినా అవార్డు నాకు పంపించేస్తారు."

"అదేంటి దేశ రాజధానిలో రాష్ట్రపతి చేతులమీదుగా లభించే ఇంతటి అరుదైన పురస్కారాన్ని అందుకోవడానికి వెళ్ళకపోవడమేంటి? నీకేమైన పిచ్చిపట్టిందా" అన్నాడు మల్లేషు.

"ఆరోజు మా రామం మాష్టారు గారి పుట్టినరోజు. ఆరు నూరైనా అవేళ నేనక్కడుండాలి. వారి ఆశీసులు పొందాలి. నాకు లభించిన ఈ పురస్కారం కన్నా ఆయన దీవెనలే నాకు మిన్న" చెమ్మగిల్లిన కళ్ళను చేత్తో వత్తుకుంటూ అన్నాడు సత్తిబాబు.

"నువ్వు దేవుడికంటె అమితంగా ఆరాధిస్తున్న మాష్టార్ని నాకు చూడాలనివుంది. నేనూ నీతో రానా"

"తప్పకుండా"

అనుకున్నట్లు ఆరోజు ఇరువురు యస్.కోట బయల్దేరారు.

"మాష్టారంటున్నావ్ ఆయన దగ్గర ఎంతవరకు చదూకున్నావేంటి?" అడిగాడు మల్లేషు ఉండబట్టక.

"నేనసలు బడికెళితేనా?"

సత్తిబాబు మాటలకు నివ్వెరపోతూ "ఏంటి న్వువనేది నువ్వెప్పుడూ స్కూలుకే పోలేదా!"

అతడి ఆసక్తిని గమనించి గతంలో కెళ్ళాడు సత్తిబాబు.

❖ ❖ ❖

అది నాలుగు రోడ్ల కూడలి. ఉదయం తొమ్మిదయిం దగ్గరనుండి అక్కడ ట్రాఫిక్కు ఊపందుకుంటుంది. సరిగ్గా అప్పడే జారిపోతున్న ఫ్యాంటును పైకెగదోసుకుంటూ రెండు

బొగ్గు ముక్కలు పట్టుకుని అక్కడికి చేరుకుంటాడు సత్తిబాబు. తోటివాళ్ళంతా బడికిపోయి చక్కగా చదూకుంటూవుంటే వీడు రోడ్డుమీద బొమ్మలు గీస్తుంటాడు. అవి చిత్రాలు కావు. కళాఖండాలు, అంత అద్భుతమైన కళ వాడికెలా అబ్బిందో తెలీదు. పూర్వజన్మ సుకృతం అనుకోవాలి. బొమ్మ పూర్తిచేసి దారిన పోయేవారి వంక దీనంగా చూస్తూ నిలబడతాడు. వాడిలో దాగివున్న కళకు మెచ్చుకున్నవారు చిల్లర విదిలించి తమ దాతృత్వాన్ని చాటుకుంటారు. ఆ పసివాడు పట్టుకొచ్చే డబ్బుల్తో బియ్యం కొని అన్నం వండుతుంది అవ్వ. సత్తిబాబుకి ఐదేళ్ళురాక మునుపే తన కొడుకు కోడలు కొండత్రవ్వకం పనిలో బండరాయి మీద పడి అసువులు బాసారు. అప్పటి నుండి ఆ పిల్లాడే అవ్వకి ఆధారం. ఎప్పుడైనా వర్షంపడి నేల తడిస్తే వాళ్ళారోజు ఆకలితో అలమటించవలసిందే.

జిల్లా పరిషత్ హైస్కూల్లో పని చేసే రామం మాష్టారు ఆత్రోవంట వెళుతూ సత్తిబాబు గీసిన బొమ్మను చూసి అమితాశ్చర్యపోయారు. ఎవరైనా వాడికి కాస్త చేయి అందిస్తే ఈ రాయే రత్నమౌతుందనుకున్నారు. ఎవరో ఎందుకు ఆపనేదో తనే చెయ్యవచ్చుకదా అనిపించింది. అంతే, వాడిని ఇంటికి తీసుకుపోయి పట్టెడన్నం పెట్టి వాడి ఆకలి తీర్చారు. కలం చేతికిచ్చి "నువ్వు నేల మీద గీసిన బొమ్మలు కాగిం మీద గీయి" అన్నారు. వాడికి కలం పట్టుకోవడంచాతగావడంలేదు.

"నువ్వేమీ చదూకోలేదా?" అడిగారు

సిగ్గుతో తల దించుకున్నాడు సత్తిబాబు. అందరిలా తనకు చదూకోవాలనే ఉంది. అయితే చదివించేదేవరు? తను బడికి పోతే అవ్వను ఎవరు చూస్తారు? బువ్వ ఎవరు పెడతారు? అందుకే ఇంతవరకు దాని జోలికి పోలేదు.

ఆరోజు నుంచి సాయంత్రం పూట వాడిని ఇంటికి రప్పించి దగ్గరుండి వాడి చేత అక్షరాలు దిద్దించారు. సహజంగా తెలివైనవాడవటంవల్ల అతి తక్కువ కాలంలోనే రాయడం, చదవడం నేర్చేసుకున్నాడు సత్తిబాబు.

జబ్బుతో మంచాన పడ్డవాడి నానమ్మ ఓ రోజు హఠాత్తుగా కన్నుమూసింది. ఒంటరివాడైన సత్తిబాబుకు తనింట్లో రవంత చోటిచ్చారు రామం మాష్టారు. వాడు గీసిన బొమ్మల్ని జతచేసి ఓ ప్రముఖ వారపత్రికకు ధరఖాస్తు చేయించారు. వాటిని చూసి మెచ్చుకున్న సంపాదక వర్గం వెంటనే అతడిని తమ కార్యాలయంలో ఆర్టిస్టుగా నియమించారు.

❖ ❖ ❖

చెప్పడం ఆపి "ఇది నా కథ" అన్నట్లు మల్లేషు వంక చూసాడు సత్తిబాబు. వాడి జీవిత గాథ విన్న మలేషు కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు. కృషి ఉంటే మనిషే ఋషి అవుతాడన్న సూక్తి గుర్తుకొచ్చింది.

తను పట్టుకొచ్చిన కొత్త బట్టల్ని మాష్టారి దంపతులకిచ్చి సాష్టాంగపడ్డాడు సత్తిబాబు.

"సుఖీభవ" అని దీవిస్తూ ప్రక్కనే నిలబడ్డ మల్లేషుని చూసి "ఇతడెవరు" అని అడిగారు రామంమాష్టారు.

చేతులు జోడించి తన్నుతాను పరిచయం చేసుకున్నాడు మల్లేషు. మాష్టారు మరేదో అనబోతూవుంటే ఆయన మాటకు అడ్డుపడుతూ "సత్తిబాబుకు నేషనల్ అవార్డు వచ్చిందండి" ఇవాళే పురస్కారాన్ని అందుకోవలసి ఉంది. అయితే ఇదే రోజు మీ పుట్టిన దినం కావడంతో మీ ఆశీసులకోసం ఇక్కడికొచ్చాడు. తనకు లభించిన అవార్డు కంటె మీ దీవెనే మిన్న అంటున్నాడు"

మల్లేషు మాటలకు అమితాశ్చర్యపోయారు రామం మాష్టారు. అదేంటి సత్తీ ఇంత మంచి అవకాశం మళ్ళీమళ్ళీ వస్తుందా చెప్పు ఏటా నా పుట్టిన రోజుకి వస్తూనే ఉన్నావు కదా! నువ్వు ఢిల్లీ వెళ్ళి అవార్డు అందుకుంటున్నావని తెలిస్తే సంతోషించనా? నా కోసం నువ్వీ అరుదైన పురస్కారాన్ని ... మరి మాటలు రాలేదు రామం మాష్టారికి. తన దగ్గర ఎంతో మంది చదూకున్నారు. ఇంజనీర్లు, డాక్టర్లు అయ్యారు. కొందరు రాజకీయాల్లో రాణిస్తున్నారు. హైస్కూలు గేటు దాటాక ఏ ఒక్కరు తనవద్ద కొచ్చి పలకరించిన పాపాన పోలేదు. కాకతాళీయంగా ఎదురుపడ్డా మొహం చాటేసుకుపోతారు. అంతవరకెందుకు తన కడుపున పుట్టిన బిడ్డ సంగతేంటి? వాడు బెంగుళూరులో ఓపెద్ద కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరని తను మురిసిపోవడమే తప్ప అక్కడికి వెళ్ళిన ఈ మూడేళ్ళలో తనను చూడటానికి ఒక్కసారైనా వచ్చాడా? ... ఊహుం. వాడికి తన ఉద్యోగం, భార్యాబిడ్డలే గాని కన్నవాళ్ళు గుర్తుకు రారు. ఉండబట్టక తనే అప్పుడప్పుడు ఫోన్‌చేసి వాడి యోగక్షేమాలు కనుక్కొంటూ ఉంటాడు. అటువంటిది ఏ బంధం లేకపోయినా తన వద్ద నాలుగు అక్షరం ముక్కలు నేర్చుకున్నానన్న కృతజ్ఞతతో ఏటా క్రమం తప్పకుండా తన పుట్టిన రోజునాడువచ్చి తన దీవెల్ని అందుకుంటున్న సత్తిబాబును ఏమనుకోవాలి? తన ఉన్నతిని కాంక్షించేవారిపట్ల కృతజ్ఞత కలిగి ఉండటం మంచిదే. అయితే దానికి ఓ హద్దుంటుంది. వచ్చిన అవార్డును సయితం పక్కనబెట్టి ఈ బడి పంతుల్ని చూడటానికి వచ్చాడంటే వాడిని ఏమనుకోవాలి? కృతజ్ఞతకు మారుపేరు సత్తిబాబా? కృతజ్ఞత అంటేనే సత్తిబాబా? మాష్టారి కళ్ళు చెమ్మగిల్లాయి. కంఠం మూగబోయింది.

(ఏప్రిల్ 2011 'విప్రవాణి' ఉగాది ప్రత్యేక సంచిక)